క్లుప్తంగా

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

సోమందేపల్లి: మండలంలోని కావేటి నాగేపల్లిలో బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరై పూజల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకట రత్నం పాల్గొన్నారు.

మేనేజరుకు సన్మానం



మేనేజర్‌ను సన్మానించిన మోరుబాగల్ రైతులు

గుడిబండ: మోరుబాగల్ యూనియన్ బ్యాంకు మేనేజర్ బదిలీపై కర్ణాటక రాష్ట్రం కొరటగెరకు బదిలీ అయ్యారు. దీంతో బుధవారం మోరుబాగల్ యూనియన్ బ్యాంకు పరిధిలోని రైతులు, ఖాతాదారులు నూతన మేనేజర్ ఉదయ్‌కిరణ్, బదిలీ మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందించిన మేనేజర్‌ను మరువలేమన్నారు. అనంతరం కొత్త మేనేజర్ మాట్లాడుతూ తాను కూడా ఖాతాదారులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తాన్నారు.

విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం

గోరంట్ల: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వంచారు. విద్యార్థులకు సమాజంలో గ్రంథాలయాలతో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులో పుస్తక పఠనం, సమీక్ష నిర్వహించారు.

వ్యాయామం తప్పనిసరి

అమరాపురం: విద్యార్థులు రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఎస్‌ఏ.చంద్రప్ప సూచించారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో వ్యాయామం చేయించారు. వ్యాయామంతో పిల్లల్లో ఏకాగ్రతతోపాటు చురుకుదనం పెరుగుతుందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏరియా కోఆర్డినేటర్‌కు ..



వెంకటప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథంలో క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటప్రసాద్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. వక్తలు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే వెంకటేశ్‌కు సన్మానిస్తున్న నాయకులు

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఎస్సీకాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం స్థానిక మాదిగ సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. స్థానిక రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప, డీజేఎస్ నారాయణప్ప, చంద్రశేఖర్, పవన్ కుమార్, మారప్ప, విజయ్ కుమార్,కోర్టు నరసప్ప, యోగేశ్,త ప్పెట సుబ్బరాయప్ప, లాయర్ రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక వాల్మీకి సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. వాల్మీకి సంఘం నాయకులు కౌన్సిలర్ రాజేశ్, చిత్తగానహళ్ళి చంద్రు, ఓంకారనాయక, రాంపురం నాగేశ్, భరత్ పాళేగార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు బుధవారం ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. మొత్తం 248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా దాసేగౌడు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా మారుతిని నియమించామన్నారు.

వెలుగుల 'పురం'



హిందూపురం: పట్టణంలోని పెనుకొండ రోడ్డులో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఎన్నో ఏళ్లుగా సరైన విద్యుత్తు సరఫరా లేక హిందూపురం ప్రధాన రహదారి సైతం కారుచీకటిగా కనిపించేంది. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ ప్రధాన పెనుకొండరోడ్డులో కొత్తగా ఎల్‌ఈడీ బటర్ ఫ్లై లైట్లు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి ట్రయల్ రన్‌గా లైట్లు వెలిగించడంతో ప్రధాన రహదారి వెలుగులు విరజిమ్మింది. త్వరలోనే ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు

- ఎమ్మెల్యే బాలకృష్ణ గొప్పలకు పోయి రూ.కోట్ల అప్పులు నెత్తిన పెట్టారు
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ధ్వజం



మున్సిపల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల వాగ్వాదం (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: వార్డుల్లో పనులు చేయకుండా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ అభివృద్ధి పనులపై మున్సిపల్ కాంట్రాక్టర్లు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బిల్లు పెండింగ్ లేకుండా ప్రభుత్వం చెల్లించినా పనులు చేయడం లేదన్నారు. వీరి వ్యవహారంతో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వచ్చేలా ఉందన్నారు. వెంటనే కాంట్రాక్టర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి పనులు మొదలుపెట్టేలా చూడాలని లేని పక్షంలో టెండర్లు రద్దుచేసి ఇతర ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్లను పిలిచి పనులు అప్పగించాలని కౌన్సిలర్ ఆసిఫ్‌వుల్లా, ఈర్షద్ అహ్మద్ అన్నారు. చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లతో మీటింగ్ నిర్వహించి పనులు మొదలు పెట్టిస్తామని, వారు చేయకపోతే బ్లాక్ లిస్టులో ఉంచి ఇతరులతో పనులు చేయించడానికైనా వెనుకాడేది లేదన్నారు. టీడీపీ పాలనలో ఎమ్మెల్యే బాలకృష్ణ గొప్పలకు పోయి గొల్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటుకు రూ.కోట్లు అప్పులు చేసి మున్సిపాలిటీ నెత్తిన పెట్టారన్నారు. ప్రతి నెలా రూ.63 లక్షలు వడ్డీ, మెయిన్‌టెనెన్స్ పేరిట మరో రూ.13 లక్షలు కట్టాల్సి వస్తోందన్నారు. ఏ వార్డులోనూ పనులు చేసేలా లేకుండా నాశనం చేశారన్నారు. అంత అప్పులు చేయడం కన్నా పీఏబీఆర్ పైప్‌లైన్లు మరమ్మతు చేసి ఉంటే నీళ్లు రావడంతోపాటు అభివృద్ధి పనులు జరిగేవన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వాదోపవాదాలు చేసుకున్నారు. టీడీపీ పాలనలో ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు వచ్చాయి? ఎన్ని పనులు చేశారు? నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్ని నిధులు ఎన్ని పనులు చేశామో చూద్దామా అని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సవాల్ విసిరారు. మా వార్డుకు పనులు కావాలని అడగకుండా.. పనులు చేయలేదని ప్రశ్నించడం సరికాదని టీడీపీ కౌన్సిలర్ రాఘవేంద్రకు చైర్‌పర్సన్ సూచించారు. అనంతరం పరిగి బస్టాండ్ వద్ద మార్కెట్ స్థలాల కేటాయింపుపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు రాధమ్మ, మాజన్‌లు డిసెట్ పత్రాలను చైర్‌పర్సన్‌కు అందజేశారు.

ఆర్‌పీజీపీటీ రోడ్డు పేరు మార్పుపై రచ్చ

ఆర్‌పీజీపీటీ రోడ్డు పేరు మార్చాలని కౌన్సిల్ ఏజెండాలో ఉంచి తర్వాత మాకు తెలపకుండా ఎలా తొలగిస్తారని కౌన్సిలర్లు ఆసీఫ్, ఈర్షద్, రోషన్ నిలదీశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలతో తొలగించామన్నారు. వైస్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ మతపరమైన అంశాలపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకోవడం మంచిదని, అందుకే అజెండాలో ఆ అంశాన్ని రద్దు చేశామన్నారు. ఈ విషయంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వైస్ చైర్మన్ జబీవుల్లా, అయుబ్, జయరాముడు కౌన్సిలర్లు సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. అందరితో చర్చించి ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపి నిర్ణయం తీసుకుంటామని చైరపర్సన్ ఇంద్రజ వెంటనే అజెండా అంశాలన్నీ ఆమోదం తెలుపుతూ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు, ముస్లిం పెద్దలు వచ్చి రోడ్డుపేరుపై ఆలోచించాలని చైర్‌పర్సన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.



విరివిగా ఓటీఎస్ కట్టించండి

రొళ్ల: మండల వ్యాప్తంగా 'జగనన్న శాశ్వత గృహ హక్కు పథకం' కింద ఇళ్ల లబ్ధిదారులచే వన్ టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) కింద నగదు కట్టించాలని ఎంపీడీఓ రామారావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ ఏఓ ఆరాధ్య, ఈఓఆర్డీ క్రిష్ణప్పతో కలిసి కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఓటీఎస్ కింద నగదు చెల్లించిన ఇళ్ల లబ్ధిదారులకు శాశ్వతంగా ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామన్నారు. వలంటీర్ల సాయంతో ఓటీఎస్ కింద నగదు కట్టించడానికి కృషి చేయాలన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, పైప్‌లైన్ మరమతులు చేపట్టాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రంగా ఉంచడానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం లక్ష్య సాధనకు కృషి చేయాలి



పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్లతో మాట్లాడుతున్న జిల్లా కార్యక్రమాల పర్యవేక్షణ అధికారి నాయక్

పరిగి: వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్ర స్థాయి నుంచి ప్రతి ఉద్యోగి వందశాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణ అధికారి డాక్టర్ కేసీ కుల్లాయప్ప నాయక్ తెలిపారు. బుధవారం ఆయన పరిగికి వచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఆస్పత్రి నిర్వహణ రికార్డులతో ఓపీ, నిల్వ మందులతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీసీడీ కార్యక్రమాన్ని 85 శాతం లక్ష్య సాధన వారంలోను పూర్తి చేయాలన్నదే ముఖ్యమన్నారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను వందశాతం లక్ష్యంతో సాధించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు స్వరూప రెడ్డి, నవీన, రూబీ, సురేష్‌కుమార్, సీహెచ్‌ఓ వన్నప్ప, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జేవీకే స్టాక్ పాయింట్ పరిశీలన



పాఠ్యపుస్తకాల వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: దొమ్మరహట్టి గ్రామ సమీపాన గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో జగనన్న విద్య కానుక స్టాక్ పాయింట్‌ను బుధవారం ఎంఈఓ శ్రీధర్ పరిశీలించారు. జేవీకే స్టాక్ పాయింట్‌కు ఇప్పటి వరకు ఎన్ని పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు. బెల్టులు ఇతరత్రా అందాయని ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 50 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు, ఒక గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు ఒక కేజీబీవీ పాఠశాలలో మొత్తం 4,650 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. జగనన్న విద్య కానుక కింద 47 వేల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా 23 వేలు ఇప్పటికే వచ్చాయన్నారు. యూనిఫారాలు, బెల్టులు, షూ, సాక్స్ 60 శాతం వచ్చాయని తెలియజేశారు. ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయండి

హిందూపురం టౌన్: మున్సిపల్ కార్మికులకు ఆప్కాస్‌ను రద్దు చేసి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన జీపు జాతాను స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ లేకుండా అందరి కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఆప్కాస్ విధానం అమలు ద్వారా కార్మికులకు నష్టపోతున్నారని, ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంతో కార్మికులను ఉద్యోగాల నుంచి ఇంటికి పంపించేలా చేస్తున్నారన్నారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలు తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. జీపుజాతా రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీలను చుట్టుకుని జూన్ 9న విజయవాడ చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్, నాయకులు నాగరాజు, ఆదినారాయణ, మల్లికార్జున, జగదీష్, ఆనంద్, నరసింహప్ప, రాము, మంజు, మూర్తి, లావణ్య, మమత, రఫీక్, నరేంద్ర, చంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే సరుకుల పంపిణీ

మడకశిరరూరల్: మండలంలోని రేషన్ కార్డుదారులకు గురువారం నుంచి ఇంటి వద్దే ఎండీయూ ఆపరేటర్లు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులు బుధవారం తెలిపారు. ప్రతి కార్డు దారునికి ఉచితంగా నాణ్యత కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు అరకిలో చక్కెర రూ.17, అంత్యోదయ కార్డు దారులకు కిలో చక్కెర రూ.13.50 చొప్పున పంపిణీ చేస్తారని, కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'స్పందన'కు గైర్హాజరైతే చర్యలు

సోమందేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం చేపడుతున్న స్పందనకు గైర్హాజరయితే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ కార్తీక్ హెచ్చరించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 29న 'స్పందనకు అధికారులు డుమ్మా' శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. ఈ క్రమంలో సబ్‌కలెక్టర్ స్పందించి అధికారులతో సమీక్షించారు. గైర్హాజరయిన వారి వివరాలు సేకరించారు. భవిష్యత్తులో ఇలాగే వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు తప్పక స్పందన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



రుచిత (ఫైల్)

పరిగి: మండలంలోని హొన్నంపల్లిలో రుచిత అనే బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. హొన్నంపల్లికి చెందిన మూర్తి కుమార్తె రుచిత గత నెల 30న ఉదయం 11 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. ఆమె ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా కనిపించలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు నిర్మించండి

పెనుకొండ: పెనుకొండ కొండకు వెళ్లేందుకు తిరంగరాయల చెరువు మీదుగా రోడ్డు నిర్మించాలని పర్యాటక పోరాట కమిటీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి కోరారు. బుధవారం విజయవాడలో ఏపీ టూరిజం సీఈఓ కన్నబాబుకు ఆయన వినతిపత్రం అందించారు. తిరంగరాయల చెరువు మీదుగా కొండ రోడ్డుకు రహదారి నిర్మించాలని విన్నవించారు. తాగునీటి పైప్‌లైన్, విద్యుత్ సమస్య తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పొగాకు వాడకంతో అనర్థాలు



లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వెంకటచిరంజీవి ఆధ్వర్యంలో బుధవారం పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా వైద్య సిబ్బంది, ఆశావర్కర్‌లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధూమపానం, పొగాకు వినియోగం వలన కలిగే దుష్ప్రవాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ హుస్సేన్‌బీ, ఎంపీహెచ్‌ఈఓ సుదర్శన్‌బాబు, సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి: పొగాకు ఉత్పత్తులతో అనేక అనర్థాలు జరుగుతాయని, ప్రధానంగా వీటి వాడకం వల్ల ప్రాణాలకే ప్రమాదమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కేసీకే నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమ వైద్యురాలు డాక్టర్ యాస్మీన్ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు నవీన, స్వరూపరెడ్డి, రూబి, సురేష్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, సెక్రటరీ సాదిక్, గార్మెంట్స్ పరిశ్రమ యజమానులు మహేష్, గంగాధర్, శామ్యూల్ పాల్గొన్నారు.

సోమందేపల్లి: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు నిర్మూలనపై వైద్య సిబ్బంది ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. మండల వైద్యాధికారి నరేష్ మాట్లాడుతు పొగాకుతో ప్రాణాలకు ముప్పు అని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు హరీష్, సీహెచ్‌ఓ మనోహర్, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం



పరిగిలో విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభిస్తున్న దృశ్యం



లేపాక్షి: రైతులకు వేరుశనగ పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు



చిలమత్తూరు: మరవకొత్తపల్లి ఆర్బీకే వద్ద వేరుశనగ పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

పరిగి: డలంలోని విత్తన వేరుశనగ పంపిణీ బుధవారం ప్రారంభమైంది. స్థానిక రైతు భరోసా కేంద్రం-1లో ఏఓ విజయభారతి ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఎంపీడీఓ సరస్వతి హాజరయ్యారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ ఆర్బీకేలలో విత్తన రిజిస్ట్రేషన్ చేసుకున్న 613 మంది రైతులకు గానూ 421 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరామప్ప,సర్పంచ్ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం, వైస్ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ జయరాం, నాయకులు రామాంజి, మూర్తి, ఆర్బీకే సహాయకులు శివ, శోభ, రైతులు పాల్గొన్నారు. శ్రీరంగరాజుపల్లిలోని ఆర్బీకేలో సహాయకురాలు రాధ ఆధ్వర్యంలో సర్పంచ్ మల్లక్క, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, కృష్ణారెడ్డి, వడ్డే నాగరాజు పాల్గొన్నారు.

లేపాక్షి: 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం బుధవారం సర్పంచ్ ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడుశ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి ప్రారంభించారు. ఏఓ శ్రీలత మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1287 మంది రైతులు 929 క్వింటాళ్ల విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చలపతి, తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి, ఈఓఆర్డీ శివన్న, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలో బుధవారం విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం అధికారులు ప్రారంభించారు. తొలివిడతలో 1,564 మంది రైతులు రిజిష్టర్ చేసుకున్నట్టు ఏఓ వంశీకృష్ణ తెలిపారు. తొలిరోజు 430 మంది రైతులకు 344.7 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశామన్నారు. మరవకొత్తపల్లి ఆర్బీకే వద్ద వైఎస్సార్సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి విత్తన వేరుశనగ పంపిణీ చేశారు.

బస్ షెల్టర్ కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: పట్టణంలోని 44వ జాతీయ రహదారి సమీపంలో వై జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ కోసం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ బుధవారం స్థలం పరిశీలించారు. జంక్షన్‌లో ఇటీవల కాలంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. స్థలాన్ని పరిశీలించి బస్‌స్టాప్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. నిధులను మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి కూలీల హాజరు పెంచండి

గుడిబండ: మండలంలో ఉపాధి కూలీల హాజరు పెంచాలని ఎంపీడీఓ రామారావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఉపాధి పనులపై అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. మండలంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. ఏపీఓ భార్గవి, ఈసీ లక్ష్మానాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన

రొద్దం: మండలంలోని రాచూరులో వివాదాస్పద స్థలాన్ని ఎస్‌ఐ నాగస్వామి బుధవారం పరిశీలించారు. గ్రామంలో స్థలం విషయంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్‌ఐ అక్కడికి వెళ్లి విదాస్పద స్థలాన్ని పరిశీలించి, ఇరువర్గాలతో చర్చించారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్‌ఎస్ గురుకుల ప్రతిభావంతుల బాలుర పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి గానూ పాఠశాలలో పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ సంస్కృతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గురుకుల విద్యాలయాల సంస్థ కమిషనర్ ఉత్తర్వుల మేరకు రెండు పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతంతో పాటు బీఈడీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6 లోపు దరఖాస్తులను కొడిగెనహళ్లిలోని ఏపీఆర్‌ఎస్‌లో ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు సెల్: 81791 19659లో సంప్రదించాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో చోరీ

హిందూపురం: మండలంలోని కిరికెర వద్ద ఉన్న అయ్యప్ప ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి దుండగులు గర్భగుడి తలుపు తాళాలు పగులగొట్టి అయ్యప్ప విగ్రహానికి ఉన్న రెండు బంగారు కన్నులు, వెండి కిరీటం అపహరించారు. హుండీని పగులకొట్టడానికి విఫలయత్నం చేశారు. విషయం తెలుసుకున్న అప్‌గ్రేడ్ రూరల్ పోలీసుస్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, సిబ్బంది తరలివెళ్లి ఆలయం వద్ద తనిఖీలు చేశారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్నారు. అనుమానితులను గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రీడలతో మెరుగైన భవిష్యత్

హిందూపురం టౌన్: ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందని ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో యూనైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రోఫీలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీ మేనేజర్ దాదా ఖలందర్, గ్రాస్ రూట్ కోఆర్డినేటర్ కిశోర్‌బాబు, ఫుట్‌బాల్ క్లబ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్, వైస్ ప్రెసిడెంట్ మహేష్ దీపక్, కరాటీ మాస్టర్ రవి, కోచ్‌లు మహమ్మద్ సలీమ్, సాయిలత, అయిషా, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు నేటి నుంచి రాగుల పంపిణీ

పరిగి: ప్రభుత్వ చౌకధాన్య డిపోల్లో జూన్ నెలకు సంబంధించి గురువారం నుంచి తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ కేజీ చొప్పున రాగులు పంపిణీ చేస్తున్నట్లు సీఎస్‌డీటీ పోతన్న తెలిపారు. ప్రభుత్వం ఈనెల 1 నుంచి ప్రజలకు మరింత పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందించాలన్న లక్ష్యంతో రాగులు పంపిణీకి శ్రీకారం చుట్టింది. రేషన్‌కార్డుకు వచ్చే మొత్తంలో కేజీ బియ్యం బదులుగా కేజీ రాగులు ఎఫ్‌పీ షాపుల్లో బియ్యంతో పాటు అందించనున్నట్లు తెలిపారు. పోర్టిఫైడ్ రైస్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.